శంకరం అనే ఆర్. ఎస్.

''నాథా'' సృష్టిలోకెల్లా అత్యంత సహనం కలిగిన జాతి మనదేనంటారు నిజమేనా?'' పేపర్లు పరపర నములుతూ ప్రశ్నించింది ఆడగాడిద, తన పతిదేవుడిని.

''ఛీ..ఛీ.. నాన్సెన్స్! ఏమిటా గ్రాంథికం? ఆ తెలుగు డిపార్ట్‌మెంట్ వద్ద పడ్డ పేపర్లు తినొద్దని ఎన్నిసార్లు చెప్పాలి మీకు? నాలా ఇంగ్లీష్ పేపర్లు తిను. నాలుగు ముక్కలు ఇంగ్లీషైనా వంటపడుతుంది'' కసురుకుంది మగగాడిద.

''ముందు నా ప్రశ్నకు సమాధానం చెపుతారా? రెండు వడ్డించమంటారా?'' అంటూ వెనుక కాళ్ళను అటెన్షన్‌లోకి తెచ్చింది ఆడగాడిద.

దాంతో మగగాడిద జడుసుకుని, భార్యవద్దకు వచ్చి ఆప్యాయంగా చెవి కొరికి ''పిచ్చిదానా, ఇన్నాళ్ళుగా యూనివర్సిటీ క్యాంపస్‌లో కాపురముంటున్నావ్! ఇంకా నీ మైండ్‌లో ఇలాంటి ప్రశ్నలు పుట్టడమేంటి? పిటీ కాకపోతేనూ?!'' అంది.

''విషయం చెప్పండి''

మనకంటే ఎక్కువ ఓపిక, సహనం వున్న నిలువు గాడిదల జాతి వేరే వుంది. వారినే రిసెర్చ్ స్కాలర్లు అంటారు.

'' ఎవరా రిసెర్చ్ స్కాలర్లు? ఏమా కథ?''

''కొశ్చెన్లు వేయకుండా విను. నీకు శంకరం అనే ఒక ఆర్ ఎస్ కథ చెబుతా''

* * *

అనగా అనగా అని మనం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెడితే శంకరం అనే యువకుడు కనిపిస్తాడు. అతనికి మంచివాడు, బుద్ధిమంతుడు, భయస్తుడు ఇలా రకరకాల పేర్లుండేవి.

శంకరం నోట్లో వేలు పెట్టినా కొరకలేడని ప్రతీతి. ఈ విషయాన్ని కొందరు ప్రాక్టికల్‌గా రుజువు చేస్తూ సురక్షితమైన తను వేళ్ళను పదిమంది ఎదుట ప్రదర్శించారు కూడాను.

అతను అస్తమానం పుస్తకాలను చక్కిలాల్లా కరకరా నమిలేవాడు. ఎప్పుడూ కుతకుత వుడుకుతూ వుండే యూనివర్శిటీ రాజకీయాల గురించి అక్షరమ్ముక్క తెలుసుకోకుండా అతను ఇంగ్లీష్‌లో రెండేళ్ళ ఎం.ఏ కోర్సు (ఇంగ్లీష్) పాసయ్యాడు. సబ్జెక్టుని సంతృప్తిగా తిన్ననేరానికి ఫస్ట్‌క్లాస్ వచ్చింది.

ఎం.ఎ గట్టెక్కిన తర్వాత ఒకానొక దుర్ముహూర్తంలో రిసెర్చ్ చేయాలని కోర్కె పుట్టింది శంకరానికి.

సరాసరి తన సీనియర్ వద్దకెళ్ళి సలహా అడిగాడు.

సీనియర్ పకపకా నవ్వి.. బుస్‌మని నిట్టూర్చి, శూన్యంలోకి నిర్లిప్తంగా చూస్తూ.. 'స్లేవరీ' అంటూ గొణుక్కుని ''ఎంతకాలం బానిసగా వుండాలనుకుంటున్నావ్? ఏడాదా మూడేళ్ళా?'' అని ప్రశ్నించాడు.

శంకరానికి అర్థం కాలేదు. ''అంటే?'' అన్నాడు.

''ఆహా! మరేంలేదు. ఎం.ఫిల్ చేయాలంటే ఒక సంవత్సరం పాటు గైడ్‌కి అరవ చాకిరి చేయాలి. అదే పిహెచ్‌డి అయితే మూడేళ్ళకు పైగా వెట్టిచాకిరి! దేన్ని ఎంచుకుంటావో నీ ఇష్టం. అయినా ఈ ప్రాథమిక సూత్రాల పరిజ్ఞానం లేకుండా నువ్వు ఎం.ఎ ఎలా చదివావు తిక్కశంకరయ్యా'' అన్నాడు సీనియర్ జాలిగా.

''నిజమా!'' ఆశ్చర్యపోయాడు శంకరం.

''ఉన్న విషయమంతే, అందరు గైడులు ఆర్.ఎస్‌ల పాలిట యముళ్ళలాగా వుండి చెండుకు తింటారు. గైడ్ల బాధలు పడలేక ఆత్మహత్యలు చేసుకున్న ఆర్.ఎస్‌ల కథలు వినలేదా?'' అంటూ రీసెర్చోపనిషత్ గురించి బోధించాడు సీనియర్.

శంకరం డీలాపడిపోయాడు.

కానీ రిసెర్చ్ మీదున్న తమకాన్ని చంపుకోలేక ఎంఫిల్‌కి అప్లికేషన్ పడేశాడు. సీటొచ్చింది. ఫీజుకట్టి చేరిపోయాడు.

ప్రొఫెసర్ విశ్వామిత్రను శంకరానికి గైడ్‌గా వేశారు.

విశ్వామిత్ర గురించి శంకరానికి కాస్త తెలుసు.

తాను పట్టిన కుందేలుకి కాళ్ళే లేవనేరకం విశ్వామిత్ర.

'రోమియో అండ్ జూలియట్‌ని ఆర్.కె.నారాయణ్ రాశాడని వాదించగల దిట్ట. సాధారణంగా వాదనల్లో విశ్వామిత్రే గెలుస్తుంటాడు.

ఎందుకంటే వాగ్వివాదంలో ఆయన అరుపులకు, హావభావాలకు అవతలి వ్యక్తి చచ్చినట్టు తోకముడిచి ఉడాయించాల్సిందే.

శంకరం విశ్వామిత్రవద్దకెళ్ళాడు.

గొంగళిపురుగు మీసాలు దువ్వుకుంటూ ''ఎవర్నువ్వు?'' అని గద్దించాడు విశ్వామిత్ర.

''నేను..శం...శంకరాన్ని సార్. మీ స్టూడెంట్‌ని'' అన్నాడు శంకరం వణికిపోతూ.

''అయితే ఏంటి?''

''ప్రస్తుతం నేను రిసెర్చ్ స్కాలర్ని. మీరు నాకు గైడ్''

''రిసెర్చ్ స్కాలర్‌వా. అయితే వెళ్ళి ఓ గ్లాసు మంచినీళ్ళు తీసుకురా''

శంకరం మంచినీళ్ళు తెచ్చి యిచ్చాడు.

''ఇప్పుడు నమ్ముతున్నా నువ్వు రీసెర్చ్ స్కాలర్‌వేనని. సరే నీకు టైప్ చేయడం వస్తుందా?''

''వస్తుంది సార్. హయ్యర్ పాసయ్యాను. టైప్ మిషన్ రిపేరీకూడా...''

''ఇక ఆపు. ఈ కాలంలోవి అసలు టైప్ మిషన్లేనా? మా కాలంలోవే అసలైన టైప్ మిషన్లు. వాటిని మొయ్యాలంటే ఇద్దరు మనుషులు అవసరమయ్యేవారు. ఆ పద్ధతే వేరు, ఆ సౌండే వేరు'' అంటూ గతంలోకి జారుకుని తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాడు.

ఓ మూడు నిముషాల తరువాత విశ్వామిత్ర గురక పెట్టసాగాడు.

శంకరం పిచ్చిమొహంతో నిలబడ్డాడు.

అరగంట తర్వాత విశ్వామిత్ర కళ్ళు తెరిచి ''అదృష్టవంతుడివి, తొందరగా మెలకువ వచ్చింది. రోజూ మూడు గంటల పాటు నా రూంలో నిద్రపోవడం హాబీ, ఇంతకూ నీకు గోలీలాడ్డం వచ్చంటావు'' అన్నాడు.

''గోలీలు కాదు సార్, టైప్ వచ్చంటాను''

వెంటనే విశ్వామిత్ర బీరువాలోంచి ఓ బండెడు కాయితాలు తీసి శంకరం ముందు కుప్పపోసి ''ఇవన్నీ తప్పులు లేకుండా టైప్ చేసుకురా'' అని ఆజ్ఞాపించాడు.

''మరి టైప్‌మిషన్..'' గొణిగాడు శంకరం.

''మన డిపార్ట్‌మెంట్‌లో వుందిగా''

వారం రోజులు చచ్చి చెడి టైప్ కార్యక్రమం ముగించాడు శంకరం. ఆ కాయితాలను మోసుకుని విశ్వామిత్ర వద్దకెళ్ళాడు.

''తప్పులేం లేవుగా?'' అడిగాడు విశ్వామిత్ర.

''లేవుసార్'' చెప్పాడు శంకరం.

''సరే, ఇక వెళ్ళు''

''సార్..మరి నా రిసెర్చ్ టాపిక్..''

''తొందరేముందోయ్, కాస్త ఓపిక పట్టు. రిసెర్చ్ స్కాలర్‌కి బుర్రున్నా లేకపోయినా ప్రధానంగా ఓపికుండాలి. మేమంతా రిసెర్చ్ కోసం ఎంత కష్టపడ్డామని. రేపోసారి ఇంటికిరా. టాపిక్ గురించి డిస్కస్ చేద్దాం''

* * *

మరుసటి రోజు విశ్వామిత్ర ఇంటికెళ్ళాడు శంకరం.

ఇంటిబయట ఒక యువకుడు స్కూటర్ తుడుస్తూ కనిపించాడు.

''మీ అయ్యగారున్నారా?'' ప్రశ్నించాడతన్ని శంకరం.

''మీరు నన్ను పనివాడిగా భావిస్తున్నారా?'' ఆనందంతో తబ్బిబ్బవుతూ అడిగాడా యువకుడు.

''అవును''

''కానీ కాదు. అదే నా బ్యాడ్‌లక్. పనివాడు ఎప్పుడుపడితే అప్పుడు పని వదిలేసి వెళ్ళిపోతాడు. నాకు ఆ ఛాన్స్ లేదు. నేను రిసెర్చ్ స్కాలర్ని''

''నేను కూడా రిసెర్చ్ స్కాలర్నే''

''అయితే ఈ టెక్కు ఎన్నాళ్ళులే. మూడు రోజులు కూరగాయలు సంచులు మోసేసరికి దిగిపోతుంది. వెళతాను వెళ్ళి నీళ్ళు తోడాలి''

శంకరం ఇంట్లోకి అడుగుపెట్టాడు.

విశ్వామిత్ర భార్య ఎదురొచ్చి '' ఎవర్నాయనా?'' అని అడిగింది.

''ఆర్.ఎస్‌నండి'' భయం భయంగా అన్నాడు శంకరం.

''ఆహా! ఇప్పటికి తీరిందా నాయనా! మిమ్మల్నని ఏం లాభం? కట్టుకున్నోడికి వుండాలి బుద్ధి. ఆ కామర్స్ ప్రొఫెసర్ భార్య చూడండి. చేతికింద నలుగురు ఆర్.ఎస్‌లను పెట్టుకుని ఎలా ఆడిస్తూవుందో అని లక్షసార్లు చెప్పాను. చెవికెక్కితేనా,

క్యాంపస్‌లో తల కొట్టేసినట్టుంది''

విశ్వామిత్ర కుర్చీలో కూచొని ఇదేం పట్టనట్టు పేపర్ చదువుకుంటున్నాడు.

''సార్, నా టాపిక్''మెల్లిగా అడిగాడు శంకరం.

''పోచికోలు కబుర్లకిది సమయం కాదు నాయనా, వెళ్ళి కూరగాయలు తీసు కురా, వంటకి వేళయ్యింది. ఇంతకు కూరగాయలు బేరమాడ్డం వచ్చా'' అడిగింది లేడీ విశ్వామిత్ర.

''రాదండి'' తప్పు చేసినోడిలా చెప్పాడు శంకరం.

''తెలుసుకో నాయనా, ఆర్.ఎస్‌కి ముందు తెలియాల్సిన ముఖ్యమైన విషయ మది'' అంటూ హనుమంతుడి తోకంత లిస్ట్, ఒక నాలుగు సంచులు శంకరం మొహంపై పడేసింది.

శంకరం బజారుకెళ్ళి కొట్టువాడు చెప్పిన ధరకే కూరగాయలు కొన్నాడు. కాని విశ్వామిత్ర భార్య వద్ద ధరలు తగ్గించి చెప్పాడు. తన జేబుకి చిల్లుపెట్టి మిగిలిన మొత్తాన్ని జమచేశాడు.

ఆపసోపాలు పడుతూ వచ్చి శంకరం కూరగాయల సంచులు పడేసిన వెంటనే, విశ్వామిత్ర కూతురు వచ్చి తన చంటోడిని శంకరానికి తగిలించి వెళ్లిపోయింది.

''వీడిని ఏం చేయాలండి?'' అడిగాడు శంకరం కంగారుగా.

''ఏం చేయడమేంటి? కొంపదీసి అమ్ముకొస్తావా ఏంటి? అలా షికారు తీసు కెళ్లు. చంటోడి సరదా తీరుతుంది'' ఆర్డర్ వేసింది విశ్వామిత్ర భార్య.

''నేను రిసెర్చ్ స్కాలర్‌ని'' అని తన ఉనికిని చాటబోయాడు శంకరం.

ఇంతలో చంటోడు ఆరున్నొక్క రాగం ఎత్తుకుని, తన ముక్కులోని ద్రవపదా ర్థాన్ని సమూలంగా శంకరం చొక్కాకి రుద్దాడు.

కాసేపటికి కాలకృత్యాలను కూడా శంకరం మీదే కానిచ్చాడు. శంకరం నవ్వుతూ 'ఛీ ఛీ' అన్నాడు.

* * *

రెండు నెలల కాలం చూయింగ్ గంలా సాగింది శంకరానికి. హాస్టల్లో భోజనం చేయడం, వెళ్లి ప్రొఫెసర్ ఇంటి వద్ద డ్యూటీలో చేరడం.

శంకరం డ్యూటీ ఇలా వుండేది. రోజూ కూరగాయలు తేవడం, గైడ్ ఇంటికొచ్చిన బంధువులను రిసీవ్ చేసుకోవడం, టికెట్లు రిజర్వు చేయడం, స్టేషన్ వద్ద వదిలిరా వడం, పిల్లలను ఎత్తుకుని మోయడం.

అప్పుడప్పుడు వారికి గుర్రంగానూ, ఏనుగుగాను వ్యవహరించడం, ఎప్పు

డైనా ''నా రిసెర్చి'' అంటూ గొణిగేవాడు.

విశ్వామిత్ర ఉగ్రంగా చూసి గుడ్లురిమి, శంకరాన్ని దారిలోకి తెచ్చేవాడు.

ఓరోజు విశ్వామిత్ర, శంకరాన్ని పిలిచి ''నీకిష్టమైన రచయిత పేరు చెప్పవోయ్'' అన్నాడు.

''తెలుగా, ఇంగ్లీషా'' సంబరంగా అడిగాడు శంకరం.

''మన సబ్జెక్ట్ ఏంటి?''

''ఇంగ్లీష్''

''మరి తెలుగు ఊసు ఎత్తావంటే తోలు వలుస్తా''

''హెమింగ్వే''

''సరే! వెళ్ళి హెమింగ్వే రచనలపై ఒక ఆర్టికల్ రాసుకురా, నీ రిసెర్చికిదే నాంది''

శంకరం హుషారుగా వెళ్ళి లైబ్రరీని ఓ వారం రోజులు తొలిచి ఆర్టికల్ తయారు చేసి విశ్వామిత్ర వద్దకు వచ్చాడు.

విశ్వామిత్ర ఆ వ్యాసాన్ని వూరికే ఎగాదిగా చూసి ''అమ్మాయ్ మన బుజ్జిగాడున్నాడా?'' అని కూతుర్ని కేకేశాడు.

బుజ్జిగాడికి, హెమింగ్వేకి ఏం బాదరాయణ సంబంధమో శంకరానికి అర్థం కాలేదు.

''లేదు నాన్నా! స్కూలుకెళ్ళాడు''

''మరేం లేదు. పడవలు చేసుకోడానికి పేపర్లు కావాలన్నాడు. ఇది ఇద్దామని'' అని శంకరం రాసుకొచ్చిన పేపర్లు చూపించాడు.

శంకరం ఖంగుతిని ''సార్, మీరు చదవకుండానే జడ్జ్...''

''చదవకుండానే చెప్పగలను నువ్వురాసింది చెత్తని, ఆ మాటకొస్తే నేను హెమింగ్వేని కూడా చదవలేదు. కాని అనుభవమా, మజాకానా?''

శంకరం కళ్ళనీళ్ళ పర్యంతమై వెళ్ళిపోయాడు.

తర్వాత ఆ వ్యాసం ' ఇండియన్ లిటరేచర్' పత్రికలో అచ్చయ్యింది విశ్వామిత్ర పేరుతో. అది వేరే సంగతి.

* * *

ఒక నెలరోజులు మామూలుగానే గడిచాయి.

ఓరోజు విశ్వామిత్ర మంచి మూడ్‌లో వుండగా చూసి ''సార్ నా రిసెర్చ్''అంటూ కదిపాడు శంకరం.

'' ఆ! అదే చెప్పాలనుకుంటున్నా. నీకో మంచి టాపిక్ సెలక్ట్ చేశానోయ్ శంకరం'' అన్నాడు విశ్వామిత్ర.

శంకరం ఆనంద బాష్పాలు జలజల రాల్చాడు.

''ఇండియన్ రూరల్ ఫిక్షన్ అంటే నీకిష్టమేనా?''

''ఇష్టమే సార్'' ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఏదో ఒక టాపిక్‌పై బండి లాగిస్తే సరి అనే నిర్ణయానికి ఇదివరకే వచ్చేశాడు శంకరం.

''రూరల్ ఫిక్షన్‌లో పుల్లారావు రాసిన నవలలపై రిసెర్చ్ చెయ్''

శంకరానికి మిడిగుడ్లు పడ్డాయి. పుల్లారావు అనే రచయిత పేరు అతను ఇదివరలో వినలేదు.

''పుల్లారావు ఎవరు సార్?'' అడిగాడు ఆశ్చర్యంగా.

దాంతో విశ్వామిత్ర ఒంటికాలిపై లేచి ''ఇలా తగలడ్డాయి మన చదువులు. పుల్లారావు ఎవరు అని అడగడానికి సిగ్గెయ్యడం లేదూ. పుల్లారావు మహానుభావుడు. నా బాల్య స్నేహితుడు. కల్చర్ ఈజ్ నథింగ్ బట్ అగ్రికల్చర్ అనే నవల్లో ఆవులు ఎలా పేడవేస్తాయనే విషయాన్ని వాడెంత అద్భుతంగా వర్ణించాడని.

చిన్నప్పుడు ఓ రోజు మా ఇద్దరి మధ్య గోలీల తగాదా వచ్చింది. వాడు. తొడచరిచాడు. నేను జబ్బకొట్టాను. ఇద్దరం గీత గీసుకున్నాము. గీత దాటితే నిన్ను పెద్దల్లో కలిపేస్తా అన్నాడు వాడు. గీత దాటకుండానే అన్నాను నేను. అప్పుడేమయిందంటే''

విశ్వామిత్రుని బాల్య ప్రవాహంలోనే వదిలిపెట్టి శంకరం లైబ్రరీకి పరిగెత్తాడు.

బుక్‌స్టాల్స్ అన్నింటిలోనూ విచారించాడు.

పాత పుస్తకాలమ్మే ఫుట్‌పాత్‌లను భూతద్దమేసి మరీ గాలించాడు. ఇంగ్లీషు పుస్తకాలు చదివే అలవాటున్న వారందరిని ప్రాధేయపడి అడిగాడు.

తమ జీవితకాలంలో సదరు పుల్లారావనే రచయిత పేరు ఎన్నడూ వినలేదని వారు ఘంటాపథంగా తేల్చిచెప్పారు.

దిక్కుతోచక విశ్వామిత్ర వద్దకొచ్చి విషయం చెప్పాడు శంకరం.

విశ్వామిత్ర కాసేపు ఆలోచించి, పెళ్ళాన్ని పిలిచి '' ఏమే అటకమీద మన పుల్లారావు గాడి నవలలేమైనా వున్నాయా?'' అని అడిగాడు.

''వాటిని మీ థీసిస్‌తో కలిసి, ఏనాడో చిత్తుకాగితాల కింద అమ్మేశాను'' అందావిడ.

''మరి ఇప్పుడు నేనేం చేయాలి?'' అడిగాడు శంకరం ఏడుపు మొహంతో.

''తిరుపతికెళ్లాలి''

''ఎందుకు, గుండు కొట్టించుకోడానికా''

''కాదు, అక్కడ యూనివర్శిటీలో గరళకంఠుడువున్నాడు. వాడిని కలుసుకుంటే నవలిస్తాడు''

శంకరం వెళ్లి గరళకంఠున్ని కలుసుకున్నాడు.

ఆయన శంకరాన్ని ఎగాదిగా చూసి ''జీవితం మీద విరక్తి పుట్టిందా?'' అని అడిగాడు.

'' ఇప్పటివరకూ లేదు. ఇక మీద చెప్పలేం''

''అసలు పుల్లారావు కథాకమామీషు తెలుసా నీకు''

''కథా కమామీషు అక్కరలేదు నవలలు చాలు''

''పుల్లారావు, విశ్వామిత్ర, నేనూ బాల్యస్నేహితులం. పుల్లారావుకి ఓనమాలు రావు. ఓరోజు వాడిని కుక్క కరిచింది. దొరలకుక్క.. దాంతో వాడికి ఇంగ్లీష్ నేర్చుకోవాలనే పిచ్చి పట్టింది. 'లెర్న్ ఇంగ్లీషు ఇన్ థర్టీ మినిట్స్' పుస్తకం చదివి, తమ దొడ్లోని ఆవులు, కుక్కలు, ఎద్దుల మీద వాడు మూడు నవలలు రాసిపడేశాడు. అయితే వాడి నవలలు ఎలా పబ్లిష్ అయ్యాయంటావ్?'' అంతా ఉక్కుపిండం మహిమ...''

''ఉక్కుపిండమెవరు?''

''ఆయనో దుక్కలాంటి పబ్లిషర్. మానవ మాత్రుడి కెవడికీ అర్థంకాని బ్రహ్మపదార్థం లాంటి నవలలను మటుకే ఆయన అచ్చేసేవాడు. పుల్లారావుకీ విషయం తెలిసి ఆయన్ని కలిసి నవలలిచ్చాడు. వాటిని చదివి ఉక్కుపిండం మూడురోజులు మంచం పట్టాడు. నాలుగోరోజు ఆనందంతో లేచి కూర్చొని వాటిని దభీదభీమని అచ్చేశాడు. ఆ తర్వాత నెల తిరక్కుండానే దివాళా తీసి, ప్రస్తుతం గోవిందరాజుల స్వామి గుడివద్ద 'ఫుల్‌టైం బెగ్గర్‌గా పనిచేస్తున్నాడు. ఓసారి నాకు, విశ్వామిత్రుడికి, పుల్లారావులకు మధ్య గోలీల తగాదా వచ్చింది...''

కెవ్వుమనికేకేసి అక్కడ నుంచి బయటపడ్డాడు శంకరం.

బయటకొచ్చిన శంకరానికి గట్టిగా నవ్వాలనిపించింది. నవ్వాడు. విజిల్ వేయాలనిపించింది. వేశాడు. తలకిందులుగా చేతులపై నడవాలనిపించింది. వెంటనే అమలుపరిచాడు.

యూనివర్శిటీల్లో తలకిందులు వ్యవహారాలు మామూలే కాబట్టి ఎవరూ అతన్ని అభ్యంతర పెట్టలేదు.

ఓ పెద్దమనిషి జాలి తలిచి శంకరాన్ని స్ట్రయిట్‌గా నిలబెట్టి, వూరు పేరు కనుక్కొని శంకరం జేబులోని డబ్బుతో టికెట్టుకొని రైలెక్కించాడు.

* * *

''ఆ తర్వాత'' ప్రశ్నించింది గాడిద.

''తర్వాత...''

''తప్పుకో తప్పుకో ఎవరో సాధువులు వస్తున్నారు'' మొగుణ్ణి హెచ్చరించింది.

సాధువుగారు వచ్చారు. గడ్డాన్ని సవరించుకున్నారు. మీసాన్ని తాడులాగా పేనడానికి ప్రయత్నించారు.

ఉన్నట్టుండి ''జై గైడు గురునాథా'' అని గావు కేకవేశారు.

ఆకాశం వైపుకి చూసి ''ఆర్.ఎస్‌ల ఆత్మలకు శాంతి'' అని ఉచ్చాటన చేశారు.

నాలుగు దిక్కులకు తిరిగి యూనివర్శిటీని బండబూతులు తిట్టి వెళ్ళిపోయారు.

''శంకరం ఏమయ్యాడో చెప్పనేలేదే'' ప్రశ్నించింది ఆవిడ.

''వేరే చెప్పడమెందుకు, చూశావుగా కళ్లతో'' అంటూ సాధువువైపు చూపించింది మగగాడిద.

ఆడగాడిద నిర్ఘాంతపోయి, స్టీం ఇంజన్‌లా నిట్టూర్చి యూనివర్శిటీ దద్దరిల్లేలా ఓండ్రపెడుతూ నిరసన వ్యక్తం చేసింది.

31-3-1989

ఆంధ్రజ్యోతి వారపత్రిక